నిర్మించితే ఖర్చు కలిసివస్తుందని, త్వరగా పూర్తవుతుందని, మద్రాసు-కలకత్తాలమధ్య దగ్గిరదారి ఏర్పడుతుందని ఆంధ్రులు రోడ్డు వంతెనను కోరుతున్నారు. ఇందుకు అయ్యే వ్యయం రెండుకోట్ల 15 లక్షలుకాగా, సగం ఖర్చును భరించడానికి ఆంధ్రప్రభుత్వం నిశ్చయించింది. మిగతా సగాన్ని కేంద్రం భరించాలని కోరింది. అయితే ధనాభావం సాకుతో కేంద్ర ఆర్థికశాఖ మన కోరికను పెడచెవిని పెట్టింది. కేవలం కోటి రూపాయల ఖర్చుకు వెనకాడుతున్నది. రాజమండ్రివద్ద రెండవ రైలువంతెన నిర్మాణం మొత్తం దేశానికెంత ప్రయోజనకరమో రోడ్డు వంతెనకూడా అంతే ప్రయోజనకరం. ఈ సంగతి కేంద్రం గుర్తించడం అవసరం.

### అసలు పార్టీ

భారత కమ్యూనిస్టుపార్టీలో ఇక ఐకమత్యం సాధించడం అసంభవమని భరాయై పోయింది. మితవాదులు, అతివాదులుగా పార్టీ విడిపోయింది. ఐకమత్యానికి వీరు చేసిన సూచనలనువారు, వారి సూచనలను వీరు తిరస్కరించారు. అతివాదులు తెనాలిలో సమావేశమై కొత్త పార్టీని స్థాపించడానికి నిర్ణయించారు. తాము స్థాపించబోయే పార్టియే అసలైన కమ్యూనిస్టుపార్టీ అని ప్రకటించారు. తెనాలి సదస్సులో వీరు ప్రదర్శించిన ఫొటోలు మార్క్స్, ఎంగెల్స్ లెనిన్, మావోలవి. మితవాదులు సదస్సును జరిపితే బహుశా మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, కృశ్చేవ్‌ల ఫొటోలు ప్రదర్శిస్తారు. కనక తేడా అంతా చైనా, రష్యాల విభేదాల నుంచి దిగుమతి అయిందే తప్ప మరేమీ కాదన్నమాట. ఈ మాటను ఉభయవర్గాలూ తిరస్కరిస్తాయి. కాని తమదే అసలు నిసలు కమ్యూనిజం అని వారూ వీరూ కూడా వాదిస్తున్నారు. ఇందులో ఏది అసలు పార్టీ ?

□□□


కలలు రెండురకాలు. రాత్రిళ్ళు వచ్చేవి, పగళ్ళు రప్పించబడేవి. రెండోరకం కలలే ఒకటోరకంవి. ఎందుకంటే అవి మనచెప్పుచేతల్లోవుంటాయి. మన ఊహాశక్తిని బట్టి అందగిస్తాయి. అస్తమానం అదేపనైతే తప్ప పగటి కలలు వంటికి మంచివే.

వాటినిగురించి శ్రీ ముళ్ళపూడి వెంకటరమణ రచన

పగటి కలలు

వెలువడుతుంది








# నీ పద్ధతి మార్చుకో

భమిడిపాటి రామగోపాలం

ఈశానాం జగతోస్య వేంకట పతే
ర్విష్ణోః పరాం ప్రేయసీం
తద్వక్షస్థల నిత్య వాస రసికామ్
తత్ క్షాంతి సంవర్ధినీమ్
పద్మాలంకృత పాణి పల్లవ యుగామ్
పద్మాసన స్థాంశ్రియమ్
వాత్సల్యాది గుణోజ్జ్వలాం భగవతీం
వందే జగన్మాతరమ్

అని మంచి శ్రుతిలో వినబడుతున్నాది కలెక్టర్ రమణకి. ఒక్కొక్క అడుగూ లోపలికి వేస్తూ ఉంటేను పొద్దుటే ఆరున్నరకి స్పెషల్ ఆర్మ్‌డ్ పోలీస్ పేరేడ్ చూడ్డానికి వెళ్ళేడు. అక్కణ్ణుంచి డి. యస్పి. టీకి రమ్మని ఆహ్వానిస్తే ఒక అరగంట గడిపి వస్తున్నాడు. ఇంతసేపూ ఒకవిధంగా ఉండిన మనస్సు ఈ ప్రార్థన వినగానే యింకో లోకంలోకి అడుగుపెట్టవలసి వచ్చింది.

డఫేదారు ఎదురుగా వొచ్చి సీ. సీ గారూ హెడ్‌క్వార్టర్సు తాసిల్దారూ ఒచ్చి కూర్చున్నారని చెప్పేడు. అంటే లోపలికి వెళ్ళి త్వరగా టిఫిన్ ముగించుకుని క్యాంప్‌కు సిద్ధం కావాలన్నమాట.

'ఈశేషు యిప్పుడప్పుడే పూజ ముగించేటట్టు లేదు .. నెమ్మదిగా, హుందాగా అడుగులు వేసుకుంటూ పూజామందిరం వేపు వెళ్ళేడు రమణ. ఇంకా శేషు ధారాళంగా శ్లోకాలు వల్లిస్తూనే ఉంది. కాంపౌండ్ వరకూ వినబడుతోంది. మంచి కంఠస్వరం. అయితేమాత్రం, ఎంతతప్పు అది ! సభ్యతకి ఎంత అపశ్రుతి ! కలెక్టరు సతీమణి అయ్యుండీ పురోహిత దుహితలా ప్రవర్తిస్తోంది శేషు

బూట్ల చప్పుడు విని, శేషు యిటు తిరిగింది "ఒక్క నిమిషం !" అని చనువుగా, మధురంగా నిర్బంధించింది. రమణ అనుకోకుండా ద్వారం దగ్గిరే నిలబడిపోయాడు. బూట్ల కాళ్ళతో లోపలికి వెళ్ళాలన్నంత కసిపుడుతుంది శేషు చాదస్తం చూస్తే జిల్లా అందరి మీదా నిరాఘాటంగా పనిచేసే కాఠిన్యం, నిర్మోహమాటం, ఎందుకో శేషు దగ్గర మెత్తబడిపోతాయి.

"ప్రసాదం పుచ్చుకోండే టిఫిన్ ఊసెత్త డానికి వీల్లేదు." నిలబడవలసిందే !

"ఒక్క నిమిషం" అయిపోయింది. శేషు ఒచ్చేస్తోంది. పళ్ళెంలో ఆరని కర్పూర జ్యోతీ, కోసినకొబ్బరి ముక్కలూ, తీర్థంతో నిండిన వెండి గ్లాసూ, పళ్ళెన్ని పట్టుకున్న పసుపురాసుకున్న చే తు లూ, ఆ చేతుల మీదుగా వ్రేలాడుతున్న తడి ఆరని జుట్టూ కనబడుతున్నాయి రమణకి. కంగారుపడి సిగరెట్టు పారేశాడు.

హారతి అందుకోమన్నట్టు ప ళ్ళెం మొహం ద గ్గ రి కి తె చ్చిం ది శే షు. "దేంక్యూ" అంటూ కర్మకాండ ముగిం చేడు రమణ. ప్రసాదం చేతులో వేస్తూ "బూట్లు విడిచేస్తే యేం ?" అనకుండా వుండ లేకపోయింది శేషు.

కళ్ళు కద్దుకోకుండానే ప్రసాదం నోట్లో వేసుకున్నాడు రమణ.

—"నాకు టైమవుతున్నాది. ఆవతల వాళ్ళు ఎదురుచూస్తున్నారు" అన్నాడు.

శేషు చిరునవ్వుతో "వాళ్ళే కాదు. మేం కూడా" అనేసి, తనో యింత ప్రసాదం తీసుకుని, కళ్ళకద్దుకొని నోట్లో వేసుకుంది. సంజ్ఞకోసం పక్కన ఎడంగా నిలబడ్డ వంటావిడతో "ఇదక్కడ పెట్టి, ముందు టిఫిన్ ఏర్పాట్లుచెయ్యి. బాబుగారు క్యాంప్ వెళతారు" అని పళ్ళెం అందించేసింది.

వంటావిడ పళ్ళెం అందుకుంటూ "ఏర్పా ట్లన్నీ చేసీనే నమ్మగారూ. మీరు భోంచె య్యటమే తరవాయి" అని అక్కణ్ణించి వెళ్ళింది.

టేబిలుమీద స్టీలుగిన్నెలో ఇడ్లీ, కొబ్బరి చెట్నీ వున్నాయి. కారప్పొడి సీసా, నేతి గిన్నె పక్కనే పెట్టివున్నాయి రెండు కుర్చీల్లోనూ ఇద్దరూ కూర్చున్నారు.

గిన్నెలో ఇడ్లెన్లుతీసి ప్లేట్లో వెయ్య బోయింది శేషు

చెయ్యిపట్టుకొని ఆపేశాడు రమణ.

● ● ●

"ఏం ?" అన్నట్టు చూసింది శేషు.

"నాకేం నచ్చలేదు."

"రుచి చూడకుండానే ?"

"టిఫిన్ కాదు....నీవిధానం."

శేషు నవ్వింది. "నా విధానం—?"

"ఓ యస్. నీ విధానం, కట్టూ, బొట్టూ వేషం, భాషా అన్నీని..........నువ్వు మారాలి."

శేషు మాట్లాడలేక, మాట్లాడక, చూస్తూ ఊరుకుంది


"ఫర్ గాడ్స్ సేక్;. నువ్వీ వేషం మానేద్దూ శేషూ !—నిన్నుచూస్తే అమ్మమ్మ జ్ఞాపకాని కొస్తోంది "

శేషు దొంగతనంగా అతనివేపుచూస్తూ "నేను బామ్మపోలికేగా !" అంది.

"జోక్స్ వె య్య కు శేషూ. నేను సీరియస్‌గా మాట్లాడుతున్నాను....నీ కిప్పుడు ఇరవైనాలుగేళ్ళు. పెళ్ళయి మూడేళ్ళు కూడా కాలేదు. ఈ పూజలూ, పునస్కా రాలూ, ఆచారాలూ, అమ్మమ్మ రూల్సూ నాకు పనికిరావు. నువ్వు నా భా ర్య గా ఉన్నంతకాలం—నువ్వు కరెక్టరు భార్యలా వుండాలి."

"తరవాత మాట్లాడుకుందాంలెండి. వాళ్లు ఎదురుచూస్తున్నారేమో అవతల !"

"ఫరవాలేదు. ఎదురుచూడనీ. వాళ్ళకి జీతమిచ్చేది అందుకే. ఈ వ్యవహారం వాయిదా వెయ్యడానికి వీల్లేదు. క్యాంపును రద్దుచేస్తున్నానని చెప్పేస్తాను. నీ కిక్కడ మాట్లాడ్డానికి ఇష్టంలేకపోతే మేడమీదికి వెళదాం పద."



"మాట్లాడ్డానికి ఏముంది?" విక్కమొహంవేసింది శేషు.

"ఏదైనా ఉంటుందేమోనని."

"నాకు నచ్చచెబుదామనా?"

"సారీ శేషూ!—నువ్వలా మాట్లాడొద్దు. నీకు నచ్చచెప్పే శక్తి నాకీసారిలేదు. అయినా నీతో చెప్పవలసింది చాలాఉందనే ఉద్దేశ్యం."

"ఏం ఉంటుంది లెండీ. టిఫిన్ తినండి"

సిగరెట్ వెలిగించుకుని, రమణ లేచి వెళ్ళాడు వడ్డించేవాళ్ళని కేకేసి ఏదో చెప్పేసి పంపేశాడు. చకచకా మేడ మీదికి వెళ్ళిపోయాడు.

వంటావిడ ప్రసాదం అందరికీ పంచిపెట్టేసి వచ్చేవరకూ శేషు అలాగే కుర్చీలో కూర్చుని ఉండిపోయింది. ఖాళీ ప్లేట్లు తియ్యబోతూ వంటావిడ ఉలిక్కిపడింది. అవి ఖాళీ చెయ్యబడ్డ ప్లేట్లు కావు; ఖాళీగానే ఉండిపోయినవి!........"ఏం, అమ్మా. ఇడ్లెన్లు భోంచెయ్యలా?"

శేషు జవాబు చెప్పకుండా లేచి వెళ్ళింది.

● ● ●

శేషు మేడమీద తన గదిలోకి వెళ్ళింది. నిలువుటద్దం ముందు కుర్చీలో కూర్చుంది. జుట్టు ఆరబెట్టుకోడానికి ఫేన్ పెట్టుగుంది. ఫేన్‌గాలికి జుట్టు అటూ యిటూ చిందరవందరగా ఎగురుతూ ముఖం మీద పడుతోంది. కళ్ళకి అడ్డం పడుతూ అద్దంలో ప్రతిబింబం కనిపించకుండా ఉంది. జుట్టు పక్కకి తోసుకుంటూ, చిక్కుదువ్వెన అటూ యిటూ నడిపిస్తూ, చిందరవందరౌతున్న ఆలోచనల్ని పాత అనుభవాల వేపు మళ్ళిస్తోంది శేషు.

చిన్నప్పటి చిలిపితనం, చెలాకీతనం, పెంకెతనం, ఏవీ, ఇప్పుడు? కాలేజీలో, ఆడపిల్లల దగ్గిర్నుంచీ కళ్ళు తిప్పుగోలేని ఆకర్షణ - ఈవిడ జోలికి పోకూడదురా నాయనా, చంపేస్తుందనుకునేటంత విసురూ, అవన్నీ ఏవీ? తను అమ్మమ్మ అయిపోయిందా, అప్పుడే? ఎందుకో!

ఎందుకా? ఈ రమణ ఉన్నాడే - ఇతనికి తన ఏ భయం ఎప్పటికేనా తనని పెళ్ళాడవలసి వస్తుందని భయం - అలా పెళ్ళాడిం తరవాత కూడా పెంకెతనం మిగిలిపోతే ఏమయిపోతుందో సంసారం అని భయం, అందుకని, ఉచ్చులు పన్ని, ఊబులు పన్ని తనని పట్టుకుని బోనులో పెట్టేశాడు, ముందుగానే.

అయితే, భయమని ఒక్కసారైనా చెప్పేడా? ఏమిటేమిటో అనేవాడు. ఏమిటేమిటో జరిగిపోయేవి. అవన్నీ జ్ఞాపకం వస్తే మొన్నమొన్న పది సంవత్సరాల క్రితం జరిగినవేనా, లేకపోతే యేదైనా అభూతకల్పనా అనిపిస్తోంది ఇప్పుడు!

## 2

"శేషూ, నీకోసం ఎవరో వచ్చినట్టుందే!" అంటూ హాల్లో అడుగుపెట్టాడు రమణ. తన కన్నపడిన దృశ్యంచూసి చాలా ఆశ్చర్యపడి, నొచ్చుకుని "సారీ శేషూ" అన్నాడు. వెనక్కి వెళ్ళిపోడానికి ప్రయత్నించాడు.

ఇంతలోనే శేషు ఒంటినిండా పైట కప్పేసుకుంది. "ఫరవాలేదు" అంది యాంత్రికంగా.

తన గదిలోకి వెళ్ళడానికి మేడమీది హాల్లోంచి ఒకత్రోవ. వసారా చుట్టివాస్తే అక్కడో త్రోవా ఉన్నాయి. హాల్లోంచి ఇక వెళ్ళడానికి బుద్ధిపుట్టక వసారాచుట్టి వెళిపోయాడు రమణ.



తనకన్నపడిన దృశ్యం అతన్ని బాధపెడుతోంది...

బజార్లోకి కొత్తగా ఒస్తున్న బ్రేషియర్స్ తొడుక్కొని, తన శరీరం అందులో ఎలా ఉందా అని మేడమీది హాల్లో నిలువుటద్దం దగ్గర నిలబడి చూసుకుంటోంది శేషు.

వాళ్ళనాన్న సంపాదిస్తున్నాడని, దానికంత మదం! డబ్బు ఎలాగైతే బాగా ఖర్చవుతుందా అని ఆలోచిస్తుంది. ఎంతసేపూ! నవనాగరీకతకి ఆ అండర్వేరు ప్రతినిధే కావచ్చు ...కాని మనలాంటి సంసార్లా, అవి తొడుక్కోడం? అని రమణ బాధపడి పోతున్నాడు.

"అంతేకాదు ...ఇంకాచాలా వున్నాయి" అనుకొని బాధపడ్డాడు.

ఎదురుగా ఒచ్చింది, శేషు స్నేహితురాలు రజని "శేషు ఉందట కదండీ, మేడమీద!" అంది.

"హాల్లో ఉంది వెళ్ళవచ్చు!" అని ఎవరో శత్రువుకి చెప్పినంత తీక్ష్ణంగా సమాధానం చెప్పేడు.

హాలు తలుపు దాకా ఒచ్చింది, శేషు. "రా, రజనీ!" అంది రమణ వెనక్కితిరక్కూడదనుకుంటూనే తిరిగిచూశాడు. "రా, బావా! ఇలావెళ్ళిపో, నీ గదిలోక్కాబోలు!" అంది చిరునవ్వుతో.

"థేంక్స్!" అని మరింత కోపంగా అనేసి వాళ్ళిద్దర్నీ దాటుకుంటూ, తనగది వేపు వెళ్ళిపోయాడు, రమణ.

రజని పలకరించింది "ఏమిటే, కథ? పెళ్ళికొడుకు అలిగినట్టున్నాడు!"

"మా బావకి ఆడవాళ్ళు బట్టలుకట్టుకుంటూ వుంటే చూడ్డానికి సిగ్గు!" అంది శేషు.

అయినా నువ్వు మరీనే—హాల్లోనేనా, ఏమిటి, నీముస్తాబు?" అంటూ బుగ్గ పొడిచింది రజని.

"మరేం చెయ్యనే, కొంపలో మరెక్కడా నిలువుటద్దంలేదు. అసలు వేళగాని వేళ ఈయనగారు ఇల్లా ఇంటికి ఊడిపడతాడనుకున్నానా ఏమిటి!" అంది శేషు సగం సిగ్గుపడుతూ, సగం గర్వపడుతూ.

● ● ●

బి ఎస్సీ ఫలితాలు తెలిశాయి. రమణ ఫస్టుక్లాసులో పాసయ్యాడు. మార్కులు తీసుకోడానికీ తత్సంబంధమైన యితరపన్లు పూర్తిచేసుకోడానికీ కాకినాడ ప్రయాణమైనాడు. "నేనూ ఒస్తాను; కోడల్ని చూడాలనుం"దంటూ సుభద్రమ్మకూడా బయల్దేరింది.

ఇంటికి చేరగానే గుమ్మంలో ఎదురైంది శేషు. "నీ పరీక్షేమైందే?" అని పలకరించింది సుభద్రమ్మ.

---

● *మధ్యప్రదేశ్ రాజధానిలో బార్‌లో బీర్ సేవిస్తున్న బోర్:*

*"గెలీలియోగారు మహానుభావుడయ్యా."*

*"ఏం!"*

*"భూమి తిరుగుతోందని మొదట కనిపెట్టింది ఆయనేగా!"*

"పోయిందత్తా!" అనికూడా వెక్కి-
మొహం వెయ్యలేదు శేషు.

"నిజంగానే పోయిందా?" అన్నాడు రమణ; "నా కెంత అవమానం!" అన్న కసితో.

"అయ్యబాబోయ్! శపిస్తావా యేమిటీ!—అరె! ఏమిటా చూద్దాం? పద పద బావా! ఇంటరు ఫస్టియర్ ఫేలయ్యేటంత మొద్దువి కాస్లే—అసలు సంగతి. ముందుంది ముసళ్ళ పండగ; ఈయేడాది! మూడుపార్ట్లకీ మూడు ఛాన్సులు రిజర్వ్‌చేసిఉంచేను. మొదట తెలుగూ. సెప్టెంబర్లో యింగ్లీషూ. మళ్ళీ మార్చిలో పార్టు త్రీ—"అంటూ మేనత్త చేతులో సంచీ అందుకుని చెంగు చెంగున గెంతుకుంటూ ఇంట్లోకి పారిపోయింది శేషు.

మెల్లిగా నడుస్తూ సుభద్రమ్మ "దీని పెంకితనం తగ్గలేదొరే!" అంది కొడుకుతో.

"దానివూసు నా దగ్గిరెత్తకు" అన్నట్టు మొహం ముడుచుకుని అటు తిప్పేశాడు రమణ.

● ● ●

"నాకు మెడ్రాస్ యూనివర్సిటీలో ఆనర్సుకి సీటొచ్చింది. నే నెల్లుండి వెళిపోతున్నా" నన్నాడు రమణ.

ఆ సాయంత్రం అందరూ యిటిదగ్గిరుండడం తటస్థించింది.

"మెడ్రాస్‌లో హాస్టల్లో ఉంటావా?" అన్నాడు రామయ్యగారు.

"లేదు; మా ఫ్రెండు నవరత్నం అని ఉన్నాడు. అతనికూడా వచ్చింది సీటు. మేం యిద్దరం కలిసి ఓ రూం తీసుకుని ఉందామనుకుంటున్నాం."

"నవరత్నం—అంటే ఆ నల్లగా మెరిసి పోతూ ఉంటాడే అతనేనా?" అని పకపకా నవ్వింది శేషు.

"ఏమిటది శేషూ; మేనర్స్ లేకుండాను! నీ ఫ్రెండ్సుని గాని, నిన్నుగాని నే నెప్పుడైనా అలా వేళాకోళం చేసేనా?" అన్నాడు రమణ.

"అదేకదా, నీతో వచ్చిన చిక్కు! నువ్వు ఎవర్నీ ఏమీ అనవు; ఎవరూ నిన్నేమీ అనడానికి వీల్లేదు!" అని మళ్ళీ నవ్వింది శేషు.

"అబ్బా. ఉండవే ..!....అదికాదయ్యా. మరి భోజనంమాట?"

"ఇద్దరం కేరియర్ తెప్పించుకుంటాం!"

"ఛీఛీ. ఎవరి చేతో కేరియర్ తెప్పించుకోడం. పైగా అతనెవరో, అతన్తో సాపంక్తి కూడానా?" అంది కమలమ్మగారు.


"నాకో ఫ్రెండున్నాడోయి. మెడ్రాసులోను. వైద్యనాథన్ అని. ఇక్కడ డీ. సీ. టీ. ఓ. గా రిటైరై మెడ్రాసులో సెటిలైపోయాడు. అంటే వాళ్ళకక్కడ యిల్లూ వాకిలీ ఉందిలే. అక్కడుంటే నీకు సదుపాయంగా ఉంటుంది. నామాట నెత్తిమీద పెట్టుకుంటాడు. పైగా అతనికి నిన్ను తెలుసు కూడాను!" అన్నాడు రామయ్యగారు.

"మేం అప్పుడే ఓ మాట అనుకోడం జరిగిపోయింది మామయ్యా.......నా మూలంగా అతనికినష్టం కలగడం నా కిష్టం లేదు."

"ఇందులో నష్టమేముంది? వాళ్ళింటో ఎలాగా నీకు రూం యిస్తారు గనా. అందులోనే అతన్నీ ఉండమనూ! ఎటొచ్చీ భోజనానికి మాత్రం అతను వేరే ఏర్పాటు చేసుకోవాలిసొస్తుంది."

"ఏమిటి మామయ్యా. నువ్వనేది? రెండేళ్ళ ఆ అరవాయనింట్లో నేను భోంచెయ్యాలా! మై గాడ్!"






శేషు మళ్ళీ నవ్వింది "అయితే మెడ్రాసులో హోటల్‌వాళ్ళంతా తెలుగువాళ్ళనా నీ ఉద్దేశం? మైగాడ్!"

"అదిగాదు శేషూ నే నన్నది; నాలుగేళ్ళు కాకినాడ్లో మీ యింట్లో భోంచేసినంత సుళువుగాదని; రెండేళ్ళుకాదుగదా, రెండు పూటలుండలేను. ఆయ నెవరు? నేనెవరు?"

"పోనీ, వోపని చెయ్యకూడదూ?" అంది కమలమ్మగారు వెడల్పుగా నవ్వేస్తూ. ఆవిడ మెదడులో ఏదో ఐడియా మెరిసిందన్న సంగతి అందరికీ తెలిసిపోయింది. అందరూ అటు తిరిగారు.

"అప్పు డనుకున్నట్టుగా పెళ్ళిచేసేస్తే ఇద్దరూ కలిసే వెళ్ళిపోవచ్చుగా!"

"పెళ్ళా!" అని వెనక్కి తిరిగి చూశాడు రమణ.

చెల్లెలు ఏమంటుందో నని అటుచూస్తూ మాట్లాడ్డం మానేశాడు రామయ్యగారు.

పైటకొంగు అడ్డంపెట్టుకుని నవ్వితే యేమంటారో అన్నభయం పొడచూపగా, చెమట తుడుచుకున్నట్టు నటించసాగింది శేషు.

సుభద్రమ్మ "అవును. అలాచేస్తే?" అన్న ప్రశ్న కళ్ళల్లోకి తెచ్చుకుని కొడుకు వేపుచూసింది.

తను యిప్పుడు పెళ్ళిచేసుకోవడం అందరికీ యిష్టమేనని, యిహ తన్ను తాను రక్షించుకోక తప్పదని తెలిసిపోయింది రమణకి. "అబ్బే యిప్పుడు పెళ్ళేమిటత్తా." అనేశాడు తల అడ్డంగా ఊపుతూ.

కమలమ్మగారు "కుర్రవాడివి నీతో నాకేమిటన్నట్టు సమాధానం చెప్పడం మానేసి సుభద్రమ్మకేసి తిరిగింది. "అప్పు డనుకున్నారు కాదొదినా. బి. యస్సీ పేసైనాక పెళ్ళిచేద్దాం అనీ!"

"అదేం లాభంలే దత్తయ్యా. నేనిప్పుడు బాగా చదువుకోవాలి. ఇంతోటి అనర్ప చదువుకి నాకొక గార్డియన్ ఉంటేగాని సాగదా ఏమిటి? ఇప్పుడు పెళ్ళిచేసుకుని అక్కడికి వెళ్ళేకంటె చదువుకి యిన్ని పీట్ళు ఒదిలి ఏ తాలూకాఫీసులోనో గుమాస్తాగా చేరిపోడం వుత్తమం."

● అందరి మొహాలూ చూసేడు రమణ. ఎవరూ పెద్దగా హర్షించలేదని స్పష్టంగా తేలిపోయింది. బ్రహ్మాస్త్రం ప్రయోగించక తప్పదు.

"అయినా నామనస్సులో మాట చెప్పేస్తున్నాను. శేషుకి ఇప్పుడు పద్దెనిమిదేళ్ళు. నా ఈసెందుకుగాని. ఒకవేళ నేతిరిగివొచ్చేదాకా ఆగినా ఇరవై వెళతాయి. అంతవరకు ఆగడం అనవసరం; అది మంచిది కాదు కూడానూ."

"అంటే. నువ్వీరెండేళ్ళూ శలవులకైనా రాకుండా మెడ్రాస్‌లోనే ఉండిపోతావా!"

"ఓస్తానుగాని. పెళ్ళిచేసుకోడాని కొస్తానా?.... ఈ రెండేళ్ళూ ఆగేకంటె తగిన సంబంధంచూసి శేషుకిపెళ్ళిచేసేయడం మంచిది మామయ్యా!" రమణ కుర్చీలో వెనక్కి చేరబడి పోయాడు.

రామయ్యగారు నవ్వేస్తూ "ఇదేమిటి. ఇవాళ కొత్తగా మాట్లాడుతున్నావు? తగిన సంబంధం చూడాలా — అంటే?" అన్నాడు.

"అంటే — నాకంటే కొంచెం యిద్దైనవాడన్న మాట."

'ఏద్దైనవాడు?'

'—అంటే కొంచెం సహనం, సంస్కారం ఉన్నవాడన్నమాట.... ...నీకు తెలీదు మామయ్యా - మొదట్నించీ దాని చేష్టలు వెర్రి నాది వేయిన్నూ - ఎవడేనా ఫారిన్ రిటర్న్‌డ్‌ని చూసి చేసెయ్యండి.......నా మాట నిజం - కావాలంటే శేషునే అడగండి నాకోపానికి అది తట్టుకోలేదు. నాతో వేగలేదు. క్షణానికోమాటు నేను దాన్ని ఇంగ్లీషు మాట్లాడొద్దంటాను.. పాపం కష్టపడి బాబ్ చేయించుకున్న జుట్టుని మామూలుగా దువ్వేసుకో మంటాను. అంగారు బొట్టూ, కళ్ళకి కాటుకా - చేతికి గాజులూ మామూలు దేశవాళీ చీరలూ. ఒక్కటే జెడా; మహిళా సమాజాలూ మీటింగులూ పనికిరావు - ఎందుకొచ్చింది ఇదంతా, - నా కోసం శేషు తన ఫేషన్లన్నీ వొదులుకుని యిన్ని మార్పులకి గురికావాలి. అలా ఏదో నాకోసం చేష్టు మార్చుకుని తయారైనా దాని ఆత్మ ఎంతో క్షోభిస్తుంది - నేను దాని కేవిధంగానూతగను. నాకన్నా సంస్కారం ఉన్నవాళ్ళు, శేషు చేష్టని గౌరవించేవాళ్ళూ లక్షోపలక్షలు! - ఎవడేనా ఫారిన్ రిటర్న్‌డ్‌ని చూసి -'

శేషు చటుక్కునలేచి అవతలికి వెళ్ళిపోయింది.

ఒక్కనిమిషం అందరూ మౌనంగా కూర్చున్నారు.

రామయ్యగారే ముందుగా గొంతుసర్దుకున్నాడు 'నువ్వు చెప్పింది రైటు కాదల్లుడూ.... - నువ్వు శేషు మనస్సు సరిగా తెలుసుకోలేకపోయావని నా ఉద్దేశ..'

"నాకూ అలాగే అనిపిస్తోంది. నీ కిష్టం లేదనితోస్తే అవన్నీ మానేసుకుని అంచక్కావుండదుట్రా? ఇవన్నీ కుర్రతనపు సరదాలేగాని మరోటా? నువ్వు చెప్పినట్టు చెయ్యడంకూడా ఓ పెద్దబాధేనా?" అంది సుభద్రమ్మగారు

"నీకు బాధకాకపోవచ్చునమ్మా. చదువూ, సభ్యతా, స్నేహబృందం-యివన్నీ ఉన్నవాళ్ళ దారివేరు మనం పంతాలు మార్చుకోవాలనుకున్నా అవి పూరుకోవుగా అంచేత. పద్ధతులు మార్చుకోడం నువ్వనుకున్నంత సులువుకాదు ......అసలలా మార్పులుతేవడం నాకే యిష్టంలేదు. హింసపెట్టి, అందులో పెళ్ళిచేసుకునేవాడికోసం తెచ్చే మార్పులు చాలా ప్రమాదం అలా చేస్తే దానికి నామీదున్న గౌరవాభిమానాలు పోయి అసహ్యం. శత్రుత్వం ఏర్పడతాయి కూడానూ. నా మాటవిని నే చెప్పినట్టు చెయ్యండి. ఏమీ పెద్దబాధవుండదు. దానికేం కన్నువంకరా? కాలువంకరా? ఎవరేనా ఇట్టే ఎగరేసుకుపోతారు."

● ● ●

"అరెరెరె! ఏమిటీ వేషం. శేషేనా? సారీ శేషూ. నిన్ను పోల్చుకోలేకపోయాను....క్వైటనెక్స్పెక్టెడ్!"

"ఆ మాట అనవలసింది నేను! ఒక్కసారి పద. నిలువుటద్దంలో చూపిస్తాను నువ్వేలా ఉన్నావోను! చొక్కా ప్యాంటులో టకప్ అయినా చెయ్యకుండా బి. యస్సీ పాసైపోయావు. ఇంతలో ఏం వొచ్చిందో ఇంతాచేసి మెడ్రాస్ వెళ్ళివొచ్చావోలేదోగాని లండనో పారిసో వెళ్ళొచ్చినట్టు వేసేవు. ఈవేషం?-" శేషు పకపకా నవ్వేసింది. "పైగా సిగరెట్టొకటి నేర్చుకొచ్చినట్టున్నావు?"

"వేషం అయితే మార్చేశావుగాని. శేషూ నీ నవ్వు మార్చలేదు!"

"అలా అని నువ్వు చెప్పలేదుగా!" అని నాలిక్కొరుకుకుంది శేషు. "అలా అన్ని మార్చేసుకుంటే స్వభావం మొత్తం మారిపోయి మనస్సే మారిపోతుంది — అప్పుడు నీ పని బెబ్బెబ్బే!" అంటూ, సరదాకే అన్నాను సుమా అన్నట్టు, నవ్వుతుంటూ పారిపోయింది.

"టెర్రిబుల్!" అనుకున్నాడు రమణ.

● ● ●

"సారీ మామయ్యా నామాటలుమీరంతా యింత సీరియస్‌గా తీసుకుంటారనుకోలేదు. ఇంతలామార్చేశారేమిటి. శేషుని! ఇదిచాలా పొరపాటు మామయ్యా. దాన్ని చూస్తే నాకు కష్టంగా వుంది — పైగా ఇదంతా నామాట మీద చేసేరు. కదా అని చాలా బాధగా వుంది!"

---

● మధ్యాహ్నమైంది. ఇద్దరు బిచ్చగాళ్ళు అడుక్కు తెచ్చుకున్నది తిని చెట్టుకింద నీడలో హాయిగా కాళ్ళు బారజాపుకుని పడుకున్నారు. చల్లని గాలి వీస్తోంది. చెట్టుపై కోయిలలు కూస్తున్నాయి.

"ఈ జీవితం బావున్దోయ్. ఇప్పుడు లక్షరూపాయిల ఆస్తి కలిసొచ్చినా అక్కర్లేదు పొమ్మంటాను." అన్నాడొకడు.

"పదిలక్షల రూపాయలొస్తే?" అన్నాడు రెండోవాడు.

"ఊహు."

"కోటిరూపాయలొస్తే?"

మొదటివాడు లేచి కూచ్చుని "కోటిరూపాయలైతే కాస్త ఆలోచించాల్సిందే." అన్నాడు.

"అబ్బే, అదేం లేదల్లుడూ.......పెద్ద ప్రయత్నం లేకుండానే మార్పు వచ్చేసింది. అసలు దాని ఫ్రెండ్సూ, ఊళ్లో వాళ్ళూ వాళ్ళూ అందరూ, అది ఇలాగే బావుం దంటున్నారు కూడాను."

కమలమ్మగారు అందుకుంది "అసలింకా నువ్వు చూశ్శేదు ఓనాడు పసుపు రాసుకుని తలంటి పోసుకుని, ఎప్పుడో నా పెళ్ళినాటి కంచి పట్టుచీరకట్టుకొనివుండగా మీ అమ్మ గారు ఏదో పనిమీద ఊవూరొచ్చేరు. దాన్నిచూసి గుమ్మంలో మ ని షి గుమ్మం లోనే ఆశ్చర్యపడి నుంచుండిపోయారు.... పోల్చుకున్న తరవాత అవిడ ఆనందం చూడాలిహ. ఎంత హంగామా చేసేరో చెప్పలేం. ఆపళంగా కూడా తీసుకుపోయి నెల్లాళ్ళుంచుకుని మరీ పంపేరు. పల్లెటూరి గాలి బాగానే వంటబట్టింది. అత్తగారి సమ క్షంలో లక్ష్మీస్తోత్రం అన్నపూర్ణాస్తవం అన్నీ నేర్చుకుని చక్కావొచ్చింది. నాకే ఆశ్చర్యం వేసిందనుకో !"

"అలాగా !" అని ఆశ్చరపడ్డాడు రమణ, "అయితే మరి పొలాలు అవీ చూసొచ్చేవా, ఇంతకీ !" అని పలకరించేడు శేషుని.

"ఆఁ, ఆఁ, చూసొచ్చేను రేపు నువ్వు కోతలకో నూర్పులకో వెళ్ళి అక్కడ కూచుంటే అన్నంతేవద్దూ పాపం !"

రమణ మాట్లాడలేదు. అతని మనస్సు ఆనందంతో నిండిపోయింది. ఎక్కడిశేషు-ఎక్కడి వేషం, ఎక్కడిభాష !

● ● ●

"పెళ్ళికి ఇప్పుడేం తొందర మామయ్యా, ఇది ఐ. ఏ. యస్ ట్రైనింగ్. ఇదయిపో యాక మళ్ళీ ఎక్కడో జిల్లాలో పనినేర్చు కుండికివేస్తారు. అంతాకలిపి రెండు సంవత్స రాల చిల్లర అవుతుంది. చాలా బిజీగా ఉంటాను. ఏమాత్రం డిస్టర్బెన్స్ ఉండ కూడదు. పెళ్ళి వీటన్నిటికీ వొక ప్రతిబం ధకం అసలు దేనికీ ఎటాచ్‌మెంటు ఉండ కూడదు. పెళ్ళిచేసుకుని దాన్ని యాతన పెట్టేకంటే అనక చేసుకోడమే హాయి కదా !"

"యాతన కేంవుంది. నీకంతడిస్టర్బెన్స్ అనిపిస్తే యిక్కడేవుంటుంది పోనీ—?"

"అదికాదు మామయ్య....నీకు సరిగ్గా చెప్పలేక పోతున్నానేమో. పెళ్ళి అనే తతంగం అయివుంటే, ఆ బంధం పట్టిలాగు తూనే ఉంటుంది — దేనికీ తోచదు — ఒకస్టెప్ ముందుకు వెయ్యాలంటే అడ్డం."

రామయ్యగారు ధారాళంగా నవ్వేశాడు. "కరెక్ట్— నా ఉద్దేశంకూడా అదే అల్లుడూ నువ్వు చటుక్కున ఒక అడుగు వేసీకుండా ఒక ప్రతిబంధకం వుండాలనే." అని యింకా పెంకెతనంగా నవ్వుతున్నాడు.

రమణ ఎర్రగా అయిపోయాడు "సర్లే మామయ్యా. అర్థమైంది. కాని అలాంటి తప్పటడుగులు వేసే మనిషిని కాదులే. ఆ మాత్రం బాధ్యత లేదనుకుంటున్నావా నాకు"

"అది కాదోయ్, నువ్వూ పెద్దవాడి వవు తున్నావు కద. అందులో ఐ. ఏ. యస్. కూడా అయ్యావు. పెద్దవాళ్ళు వేసే అడు గులు పెద్ద అడుగులుగా వుంటాయి — నీకు మా మీదా శేషుమీదా ఎంత అభి మానం ఉన్నప్పటికీ పెళ్ళి అంటూ కానంత కాలం — ఏదోకుర్రాడు. వెనకాల యింత ఉంది; ఐ. ఏ. యస్ ప్యాసైనాడు; అని ఎవరికైనా నీ మీద ఆశపుట్టిన్నాడు సరాసరి నీతోనే సంప్రతిస్తారు కదా !"

రమణ నవ్వాడు "అప్పుడు చిక్కొ స్తుంది — నిజమే....ఎంత గడుసువాడివి మామయ్యా!- కాని వొక్కటి గమనించటం మానేశావు....వెనక నేను అనర్సు చదువు కుండికి వెళుతూ, శేషుకి ఏదేనా సంబంధం చూసెయ్యమన్నాను. ఇప్పుడలా అనడం లేదుగదా !"

● ● ●

# 3

మధ్యాన్నం పన్నెండైంది. ఉఫేదారూ వంటలక్కా గుసగుస లాడుకుంటున్నారు. వాళ్ళకి ఇంత కష్టం ఎప్పుడూ రాలేదు. అంతకు ముందల్లా ఆదర్శ దాంపత్యం అను కునే వాళ్ళు. హఠాత్తుగా, పొద్దుట, అదేం కారణమో - అతగవుకూడా అంత స్వల్ప వ్యవధిలో అలా ఎలా వచ్చిందో -........ ఎవరి గదిలో వారు !- బైట పెద్ద పెద్ద వాళ్ళకి ఆశాభంగం జరుగుతూనే ఉంది.... భోజనాలూ లేవూ, బొట్లూలేవు. లోకం గమనమే స్తంభించిపోయింది, నౌకర్లు ఇంటికి వెళ్ళడానికి అనుమతి లేదు. ఉండడానికి అవసరమూలేదు. ఆర్డర్సు పడని కాయి తాలూ, మనుష్యులూ, ఎక్కడ చూసినా !

ఇంతకీ ఎవరిమీద ఎవరు అలిగారా అన్నది తేలలేదు. బ్రేక్ ఫాస్టు టేబిల్ దగ్గర్నుంచి ముందుగా లేచిపోయింది బాబు గారే. కాని అంతకుముందే అమ్మగారు అలిగి ఆయన్నేదైనా అన్నారేమో - ఎవరు చెప్పగలరు ?- వాళ్ళ గురించి వీళ్ళ వ్యూహాలు ఏమీ పని చెయ్యకపోయింది ఇదే మొదటి సారి !

హఠాత్తుగా మేడమీద చిన్న చప్పుడు వినిపించింది. అయ్యగారు అమ్మగారు గది లోకి వెళ్ళిన అడుగుల చప్పుడు అది. బూట్లకాళ్ళు చేసిన చప్పుడు; పైగా పడమ ట్నించి తూర్పుకి కదా వచ్చింది! సందేహంలేదు.

● ● ●

"లే శేషూ. భోజనాలు చేద్దాం."

"నాకు భోంచెయ్యాలని లేదు."

"ఏం ?"

"ఆకలిగా లేదు. ఏమిటేమిటో జ్ఞాపకా లొస్తున్నాయి. వాట్లతో ఏమీ తోచడంలేదు."

"అదంతేలే. నాకూ అల్లాగే. మనిద్దరికీ కామన్ థింగ్స్ చాలా ఉన్నాయి; వాటి జ్ఞాపకాలు మన్ని బాధిస్తూనే ఉంటాయి. మనం ఎక్కడా పారేసుకోలేం వాటిని. లే భోంచేద్దాం."

"ప్లీజ్ ఈపూటకి నన్నువదిలేసి మీరు భోంచేద్దురూ."

"డోంట్ బి సిల్లీ. మన కా ఫ్రీడమ్ లేదు. మన ప్రవర్తనగురించి యిప్పటికే గుసగుసలు బైల్దేరి వుంటాయి, వాళ్ళేవరూ ఇంతకన్నా ఏమీ సృష్టించి ప్రచారంచెయ్య కుండా జాగర్తపడ్డం చాలాఅవసరం పద."

కాలింగ్ బెల్ నొక్కాడు రమణ. "వస్తున్నా !"నని మూడుకంఠాలు వొక్క సారిగా జవాబిచ్చాయి కంగారుగా.

---

● రెండోక్లాసు చదువుతున్న లలిత, కమల స్కూలుకు పోతున్నారు.

*లలిత : "మా అమ్మతో బొత్తిగా వేగలేకుండా వున్నానోయ్. కాల్చుకు తినేస్తోందనుకో."*

*కమల ; "ఏం ?"*

*లలిత : "నిద్దరావటం లేదు మొర్రో అంటుంటే రాత్రిపది కాకుండా పడుకోమంటుంది. ఇంకా నిద్దరొస్తోందని మొత్తుకుంటున్నాసరే, ఏడింటికల్లా లేపుతుంది."*

"శే" అన్నాడు రమణ.

శేషు లేచివొచ్చింది; నవ్వుతెచ్చేసుకుంది.

● ● ●

"నువ్వలా మౌనంగాఉంటే నాకు బాధంటదు శేషూ. నే చెప్పిందానిగురించి ఆలోచించు. ఈ జిల్లాలో కలెక్టరు సతీమణి మహిళాసంఘానికి అధ్యక్షురాలుగా వుండడం ఆచారంట. నీ మౌనం చాలా విమర్శకు అవకాశం యిచ్చింది. నే నేమీ బదులు చెప్పలేకపోయాను."

"నా కలాటివాటిమీద నమ్మకంలేదు."

"ఒకప్పుడు ఉండేదేకద."

"ఇప్పుడులేదు."

"లేకపోతే. ఎల్లా? అంతమందిని నిరుత్సాహపర్చడానికి మనకి హక్కులేదేమో!"

"అవును. మనకి హక్కులేదు. పొద్దున్నే చెప్పారుగా."

"నువ్వలా పొడిపొడిగా మాట్లాడ్డం ప్రయోజనంలేదు. తేల్చేసెయ్యి అటో యిటో!"

"అంటే! నాకు ఛాయిస్ ఉంటిటా?"

"అఫ్‌కోర్స్ లేదు!"

"ఇప్పుడే కాదు. ఎప్పుడూ నాకు ఛాయిస్ లేదు. మంచి అవనీ. చెడ్డ అవనీ. నేను నమ్మనీ. నమ్మకపోనీ. నాకు నచ్చనీ. నచ్చకపోనీ - నువ్వు చెప్పినట్టు మారిపోవడమే నా కర్తవ్యం!.... స్టూడెంట్‌గానుండి మా నాన్నకి కాబోయే అల్లుడిగా ఉన్నప్పటినుంచీ కూడా అధికారం నువ్వే చెలాయిస్తున్నావు. నే నెలా ఉంటే నీకు భార్యగా ఉండడానికి తగుదునో - కాకపోతే యెలా వుంటే నీకు తగనో - అన్నీ గీతలు గీసి పెట్టేవు. నీ కోసం పుట్టింటి వాళ్ళూ అత్తింటి వాళ్ళూకూడా సమర్థులైనప్పటికీ ఫేషన్లన్నీ వొదిలేశాను. పాతకాలంపు నగలు మోస్తున్నాను. ఇంగ్లీషులో నాకు నచ్చే సాహిత్యం అంతా వుండగా కృష్ణ కర్ణామృతం, శివానంద లహరీ లక్ష్మీస్తుతి, అన్నపూర్ణాస్తవం, ఆఖరికి వేంకటేశ్వర సుప్రభాతం - నేర్చేసుకున్నాను."

"అయామ్ సారీ శేషూ. టెరిబ్లీ సారీ.... అప్పట్లో నేనిల్లా పెద్ద వుద్యోగంలోకి వస్తానని అనుకోలేదు. ఎక్కడో సంసారపక్షంగా, గుట్టుగా కాలక్షేపం చేసేస్తాం అనే అప్పటి వూహ. అలాంటప్పుడు నువ్వుకూడా సాధారణంగానే ఉంటే మంచిది కదా - ఇంతకీ మూలం పెద్దవాళ్ళు. మనిద్దర్నీ వాళ్ళు పెళ్ళి అనే పదం వాడకుండా ఎప్పుడూ ఉదహరించలేదు. అంచేత నేనుకూడా నిన్ను పరాయివ్యక్తి కింద భావించడం మానేసి నాలో ఒక భాగంగా ఎంచుకున్నాను అందుకే మనకి ఏ మార్గం, ఏ పద్ధతి సేఫ్‌గా ఉంటుందీ అనే ప్రశ్నమీద అలా మాట్లాడేవాణ్ణి—"

"కరెక్ట్. కాని ఇందులో చిక్కు ఏమిటంటే, నేను మొదటిసారి నీకోసం మారిపోయినప్పుడు చాలా సంతోషంగా, హృదయపూర్వకంగా మారేను. అదో సాహసం క్రింద. ఎవరికీ జరగని అనుభవంక్రింద ఒక ఆదర్శంలా తోచింది. బి. ఏ. చదువుకునీ, కొన్నాళ్ళు నవనాగరీకంగా ఉండడం అలవాటైన నాకు-సామాన్యంగా ఉండడం, మన పాతఆచారాలను పాటించడం కష్టమనీ, కష్టమైనదాన్ని ఆచరించడ మనే సాహసం చేస్తున్నాననీ, నాకు గర్వంగాఉండేది. నాకు ఆదారి చూపించిన నిన్ను ఆ రోజుల్లో చాలా అభినందించేదాన్ని."

"నిజంగా? థేంక్యూ."

"డోన్ట్ మెన్షన్. అయితే నా కొక చిత్రమైన అనుభవం జరిగింది........ నువ్వు ఫైనలియర్‌లో ఉండగా ఐ ఏ. ఎస్‌కి వెడుతున్నానని వ్రాశావుకదా. ఆ ఉత్తరం మీ అమ్మకి అందినప్పటికి నేను మీఊళ్ళో ఉన్నాను. మీ అమ్మకి ఆ ఉత్తరం చదివి వినిపించింది నేనే. ఐ ఏ. యస్. అంటే ఆవిడకి అర్థంకాలేదు. అది పాసవుతే కలెక్టర్ అవుతావని నే చెప్పేను. సంతోషం పట్టలేక నన్ను ముద్దులాడింది మీ అమ్మ. అప్పటికి నువ్వింకా ఆ పరీక్ష ప్యాసూ కాలేదు; నేను నీ భార్యనీకాలేదు. వెంటనే వేంకటేశ్వరస్వామికి నాచేత మ్రొక్కించింది ఆ పరీక్ష పాసైతే పెళ్ళిబట్టల్తో నీ దర్శనం చేయిస్తానని! నా కింకా నమ్మకంకలగని రోజులవి. నమ్మకంలేని వాళ్ళు మొక్కుకుంటే తప్పకుండా పని జరుగుతుందట; పోనీ చూడమని; ఆ మొక్కినంతసేపూమాత్రం స్వామివారి అధికృతని శంకించకుండా మనస్సుని దిటవు చేసుకోమని బోధపరిచి, నాచేతే మొక్కించింది మీ అమ్మ. అఫ్‌కోర్స్-నీ శక్తివల్లనే ఏ దేవుడి అనుగ్రహం లేకుండానే నువ్వు గొప్పవాడివి కావాలని నా కెప్పుడూ కోరిక. కాని, నేను నువ్వు చెప్పినదారిలో సగం పడి ఇలా యిలా అలవాటువల్ల దైవభక్తి పెంచుకున్నాను. ఒక్క దైవభక్తేకాదు; నువ్వు గీసిన గీట్లన్నిట్లోనూ, ఏదో మంచి అర్థం కల్పించుకొని ఆచరిస్తున్నాను....... నన్ను అడుగడుగునా మార్చగల అధికారం నీ కుంటికదా అని ఇంతలా దాన్ని వినియోగించడం న్యాయంకాదు బావా."

"ఛా. అదేమిటి శేషూ అలా అంటావు! జిల్లాకి కలెక్టరైనా పెళ్ళానికి మొగుడేగా! ఆ అధికారం నీకుమాత్రం లేదూ?"

"లేదు! కలానీ భార్యైనా, కలెక్టర్ భార్యైనా భార్య భార్యే! అధికారం లేనే లేదు!!"

"అలా జెనరలైజ్ చెయ్యడం దారుణం నేను ఉందంటున్నానుగా! ఎవరి ఊసో నీ కెందుకు?"

"ఎవరి ఊసో నాకెందుకు. నా ఊసే! నాకు నీ పంథాలూ అలవాట్లూ మార్చే అధికారం ఎక్కడిది?- నిన్ను పంచెలూ కళ్ళాల్చీలూ కట్టుకోమని అడిగాననుకో - ఇట్‌లుక్స్ సో ఫన్నీ!"

"నేనుగాని మా వూళ్ళో ఉండిపోయి వ్యవసాయం చేసుకుంటే తప్పకుండా కట్టుకుందును!- పరిస్థితుల కనుగుణంగా-"

"పరిస్థితులే మరి!- కాని నాకంటూ వేరే వుండవు. నీ పరిస్థితులే నావి; నీ అభిరుచులే నావిగా ఉండాలి. నీ పంథాలన్నిటికీ ఒక రాచకీయ కారణం ఉండాలి. దాన్ని కాదనడానికి నాకు అవకాశం ఉండదు. భార్య ఎంత తెలివిగలదీ అనే దానిమీద ఆధారపడి ఉండవు. భార్య హక్కులు. రాజానికి భార్య అధికారాలే పరిమితం.అంతే. అంతదాకా ఎందుకు?- మనిద్దరికీ పెళ్ళి అయిననాడు, ఆ మొదటిరోజు - నువ్వు నా దగ్గిరిసా ఒస్తే నేను నిన్ను ఏమన్నానో జ్ఞాపకం ఉందా?"

'.... .... .. ....'

"ఉండదు నాకు తెలుసు. వేళాకోళం చేస్తున్నానని ఏమీ అనుకోకు. ఏదేనా ప్రయోజనం కోసంకాదు; ఊరికే చర్చ ఒచ్చింది గనక చెబుతున్నాను. - .... .... ఆరోజు, నువ్వు నాదగ్గిరసా ఒస్తే, నీనోరు సిగరెట్ వాసన వేస్తోందని, కిస్ చెయ్యనివ్వలేదు నిన్ను. ఆవేళ నిన్ను నేకోరిందే నామొదటి కోరిక - సిగరెట్లు మానెయ్యమని. వెంటనే మానేస్తావని చాలా గర్వంగా అనుకున్నాను. ఎందుకంటే, నీకొక్కవల్సిన విధంగా నన్ను నువ్వు

మూసలో పోసి తయారు చేసుకున్నావు కదా, ఆమాత్రం సరదాగా అర్థం చేసుకోలేక పోతావా అని! - నువ్వు నవ్వేసి, ఒక్కసారిగా ఎలామానెయ్యడం, క్రమంగా మానేస్తానని చెప్పేవు .... .... పదే పదే పిలిచి పెట్టకుండా అడగడానికి నాకు చాలా మొహమాటం వేసింది. దానిక్కూడా చాలా కారణాలు వుంటాయి. ఏదో నలుగురిమధ్య ఉండే మనిషివి, నువ్వు సిగరెట్స్ మానేశావని ఎవరు గుర్తుపట్టినా సిల్లీ రిమార్క్స్ పడతాయి .... నేను కొన్నిసార్లు సిల్లీగానే జ్ఞాపకం చేసేను. నీ సిగరెట్ కేస్ దాచేసి, లైటర్ దాచేసిన్నీ. అది నువ్వు పట్టించుకోలేదు.

ఓసారి మనం మైసూర్ వెళ్ళేం. అక్కడ సినీమాహాల్లో నిన్ను సిగరెట్ కాలుస్తున్నావని పట్టుకున్నారు....నువ్విక్కడ కలెక్టరని వాళ్ళకి తెలీదు. అందుకని నీకు అవమానం అనిపించలేదు. నాకు చాలా కష్టమనిపించి సిగరెట్లు మానెయ్యరాదా అన్నాను. "ఫర్వాలేదులే" అన్నావు. పోనీలే వెధవ సొద. నీకు బాధకలిగించడం నా కిష్టంలేదు."


"నోనో. బాధలేదు చెప్పు."

"అంతేనండీ - మొదటిసారి పూర్తిగా పద్ధతి మార్చుకోమంటే సహజంగా తీసుకున్నాను; ఇప్పుడు మళ్ళీ మారమంటూ వుంటే ఏదో నటనచెయ్యమంటున్నారన్నట్టు బాధగా వుంది. అంతకిమించి కష్టం ఏమీ లేదు. మీరెలా చెయ్యమంటే అలాగే చేస్తాను. నాదేంలేదు!"

రమణ లేచి నుంచున్నాడు. టిన్‌లోవీ కేస్‌లోవీ సిగరెట్లు అన్నీ న్యూస్ పేపర్లో పోశాడు. లైటర్ వెలిగించి పెద్ద మంట చేసేడు. బాత్‌రూమ్‌లోకి వెళ్ళి, లైటర్ అందులోవేసేసి, బాల్చీడు నీళ్ళు పోసేశాడు ఇవతలికి వొచ్చాడు. శేషూ మొహంవేపు చూడలేకపోయాడు.

"నన్ను క్షమించు శేషూ" అన్నాడు తన రెండుచేతుల్లోనూ ఆమె రెండుచేతులూ పట్టుకొని.

శేషు మాట్లాడే ధోరణిలోవుంది. "ఈ పాతివ్రత్యం ఎన్నాళ్ళులే!" అనే చవకబారు వెక్కిరింపు ఆమె నోటిదాకా వచ్చింది. కాని రమణ నిర్ణయంలో బలం ఆమెకి తెలును. నోరు జారకుండా ఆ చేతుల్ని పైకెత్తి ముద్దుపెట్టుకుంది. □□□




# సెక్రటరీ

*(గత సంచిక తరువాయి)*



యద్దనపూడి సులోచనారాణి

ఆ రోజు జయంతి వెళ్ళేసరికి రోజూ కంటె ఆలస్యం అయింది. రాయవలసిన వుత్తరాలు చాలావున్నాయి. నిన్న టపా అసలు విప్పనే విప్పలేదు. రాజశేఖరం టైప్‌చెయ్యమని యిచ్చిన కాగితాలుగూడా అలాగే వుండిపోయాయి. గబగబావచ్చిన జయంతి కర్టెన్ తొలగించుకుని గదిలోకి రాబోతూనే నిర్ఘాంతపోయి ఆగిపోయింది జయంతి చేతివేళ్ళు కర్టన్‌ని గట్టిగాపట్టుకున్నాయి. గదిలో మామూలుగా తను కూర్చునే కుర్చీలో యెర్రగా, సన్నగావున్న ఒకతను కూర్చుని కాగితాలు చూస్తున్నాడు. జయంతి కేం చెప్పాలో తోచలేదు. అతనెవరో తెలియదు. ఇంతకుముందు చూడలేదు. ఇంతలో అతనే తలెత్తి "హల్లో" అని క్షణంసేపు జయంతిని పరీక్షగాచూసి "లోపలికిరండి" అన్నాడు. జయంతి యీసారి యింకొంచెం ఆశ్చర్యపోయి కళ్ళు పెద్దవి చేసుకుని చూడసాగింది.

"ఓ! ఆ! యిప్పుడు గుర్తుకొచ్చింది నాకు. మీరు వనితావిహార్ సెక్రటరీగారూ! లోపలికిరండి." చనువుగా పిల్చాడు అతను జయంతి మెల్లిగా లోపలికివచ్చింది.

"యేం పనిమీద వచ్చారు? ఇన్విటేషన్ యివ్వటానికా? చందాలు వసూలు చెయ్యటానికా?" జయంతి వైపుచూస్తూ హేళనగా అడిగాడు అతను. జయంతి రెప్పవాల్చకుండా చూడటంతప్ప మరేం మాట్లాడలేదు. ఆ చూపులకి అతను కొంచెం ఇబ్బందిగా కుర్చీలో కదిలి, "ఇలా అడుగుతున్నావేం అని కోపం తెచ్చుకుంటున్నారా? తెచ్చుకోండి. నాకభ్యంతంలేదు. ఒక్కముక్కలో చెప్పాలంటే మీరువచ్చినవేళ మంచిదిగాదు. అతని సెక్రటరీ శివరామ్ యీ గదిలో వుండగా మీరు రాజశేఖరం దగ్గరనుంచి ఒక్క నయాపైసాకూడా తీసుకెళ్ళలేరు."

"నేను - నేను -" జయంతి మాటకోసం తడుముకోసాగింది.

"సారీ! ఇందులో మిమ్మల్ని నేను వ్యక్తిగతంగా యేమీ అనటంలేదని మీరు గ్రహించాలి. మీరు కావాలంటే వెళ్ళి డైరెక్టుగా మీ సుమిత్రాదేవితో శివరామ్ నన్ను ఇన్‌సల్ట్ చేశాడని చెప్పండి చెప్పినా నేను భయపడను. ఆ చెప్పేటప్పుడు వనితా విహార్ అంటేనూ, అందులో వాళ్ళిలా చందాల రూపంలో పోగుచేసి డబ్బు ఖర్చు పెట్టే విషయంలోను మాకెవ్వరికీ సదభిప్రాయం లేదని గూడా చెప్పండి.

"నేను - నేనిప్పుడు వాళ్ళకి సెక్రటరీగా లేను."